క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ పాకబండ విద్యుత్ లైన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత విద్యుత్ సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మధురానగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 15 వరకు, బృందావనం వెంచర్, గొల్లగూడెం, భూమాత వెంచర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

రఘునాథపాలెం: డబ్బుల విషయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడి దాడి చేసుకున్న ఘటనపై గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. మండలంలోని రజబలీనగర్‌లో ట్రాక్టర్‌తో వస్తున్న వీరన్న కుమారుడు అశోక్‌ను అదే గ్రామానికి చెందిన ఉపేందర్ అడ్డగించి దుర్భాషలాడుతూ దాడి చేయడంతో పాటు ట్రాక్టర్ తాళాలు లాక్కొన్నాడు. దీంతో అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అక్రమ కేసులు అప్రజాస్వామికం

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్‌ను ఖండిస్తూ ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కనీసం నోటీస్ ఇవ్వకుండా, కుటుంబసభ్యులకు సమాచారం లేకుండా అరెస్ట్ సరికాదన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న శ్రీనివాస్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. శ్రీనివాస్‌పై పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ సమీపంలో ఖమ్మం-ఇల్లెందు ప్రధానరోడ్డులో గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు గాయాలు కాగా.. అదే వాహనంపై ఉన్న వరుణ్ ఎదురు వాహనదారుడు అనంతరామయ్యపై ఫిర్యాదు చేశాడు. దీంతో అనంతరామయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

పరామర్శ

కామేపల్లి: మండలంలోని శ్రీరాంనగర్, లచ్చ తండాకు చెందిన భూక్యా బుచ్చ, అజ్మీరా బోడి ఇటీవల మృతిచెందగా గురువారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ మృతుల చిత్రపటానికి పూలమాలలు వేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు ఆంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, అజ్మీరా రాజునాయక్, కన్నమల రాంబాబు, మేదర శ్రీను, మంచాల వెంకన్న, అజ్మీరా కుమార్, రమేష్, ముపాళ్ల రాము, దోమల బాలశౌరి, ఏనూటి గోపి, జానీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప-2
వినోద	ముసాఫా
సాయిరాం	విడుదల-2
ఆదిత్య	పుష్ప-2
శ్రీనివాస	మాక్స్, బచ్చలమల్లి
సినీగెలాక్సీ	యూఐ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	30		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	48		20
కాకర	48	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	38	తోటకూర	3
దొండ	50		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	40		25
క్యాప్సికం	64	-ఖమ్మం వ్యవసాయం	

ఆదరణ లేక.. ఆగమాగం!

అధ్వానంగా టీటీడీ కల్యాణ మండపం

- పెంట కుప్పలు, చెత్తాచెదారం దర్శనం
- నీరుగారుతున్న టీటీడీ నిబంధనలు
- పార్కింగ్ ప్రదేశంగా మారిన వైనం
- కన్నెత్తిచూడని అధికారులు



మండపంలో పార్కింగ్ చేసిన ట్రాక్టర్ (ఇన్‌సెట్) విరిగిన మండపం బోర్డు

ఊడ్చే వారు లేరు.. పట్టించుకునే నాథుడే కనబడరు.. ప్రహరీ గోడ కూలి.. చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది టీటీడీ కల్యాణ మండపం. టీటీడీ నిబంధనల మేరకు అగరొత్తుల వాసన వెదజల్లాల్సి ఉండగా.. దుర్గంధం వెదజల్లుతోంది. నిర్వహణ లోపం.. అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వాహనాలకు పార్కింగ్ ప్రదేశంగా మారింది. - నేలకొండపల్లి

1994లో శంకుస్థాపన..

గ్రామస్తుల కోరిక మేరకు మండలకేంద్రంలోని భక్త రామదాసు జన్మస్థలంలో టీటీడీ ఆధ్వర్యాన కల్యాణ మండపం నిర్మించాలని తలంచారు. ఈనేపథ్యాన 25 సెప్టెంబర్ 1994లో అప్పటి మంత్రి సంభాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేయగా.. నిర్మాణం పూర్తయ్యాక 1999లో నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యాన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండపాన్ని ప్రారంభించారు. తర్వాత కొంతకాలం బాగానే నిర్వహణ కొనసాగినా.. కాలక్రమేణ మండప నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. మండపం ప్రహరీ కూలినా పట్టించుకోవడం లేదు. ప్రధాన గేట్లు తుప్పు పట్టాయి. సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చివరకు ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ట్రాక్టర్లు, కారులను పార్కింగ్‌గా చేసుకున్నారు. గతంలో ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

టీటీడీ నిబంధనల ప్రకారం మండపంలో ప్రతీరోజు క్లీనింగ్, పూజలు చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ పరిశుభ్రత దేవుడు ఎరుగ.. పెంట కుప్పలు, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. మండపంలోకి వెళ్లగానే అగరవత్తుల వాసన బదులు దుర్గధం వెదజల్లుతుండడంతో ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి దాపురించింది. అంతేకాక మందిరంలోని రామదాసు విగ్రహం కూడా నిరాధారణకు గురైంది. గతంలో మండపం వద్ద ఆకతాయిల అల్లర్లు ఎక్కువైందని స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదులు అందాయి. అసలు ఇక్కడ పనిచేసే సిబ్బంది వివరాలు కూడా కనిపించడం లేదు. ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



మండపంలో పెంట కుప్ప, చెత్తాచెదారం

పూర్వవైభవం తీసుకురావాలి



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మండపం నిరుపయోగంగా మారింది. ప్రహరీ కూలింది. గేట్లు బాగలేదు. చెత్తచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. పరిశుభ్రత కోసమైనా వాటిని తొలగిస్తే బాగుంటుంది. రామదాసు విగ్రహానికి పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

చిత్తశుద్ధి కనిపించడం లేదు



మండప నిర్వహణపై టీటీడీ అధికారులు పట్టించుకోవడం లేదు. నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలి. గతంలో దీని నిర్మాణానికి మంజూరైన నిధులు తెలిసేలా బహిరంగ బోర్డు ఏర్పాటు చేయాలి. చిత్తశుద్ధి ఉంటే వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలి.

- మారిశెట్టి వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త

భక్తిభావం పెంపొందించాలి



టీటీడీ కల్యాణ మండపంలో నిత్యం భక్తి పాటలు, పూజలు చేస్తూ ప్రజలకు భక్తిభావాన్ని పెంచేలా ఉండాలి. ఇలా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తే ఎలా బాగుపడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రైవేట్ పరమయ్యే అవకాశం ఉంది. తగిన చర్యలు తీసుకోవాలి.

- మేకల వెంకటేశ్వర్లు, భక్తుడు, అనంతనగర్

అధికారం, పదవులే బూర్జువా పార్టీల లక్ష్యం



జెండా ఎగురవేస్తున్న కర్నాటి భానుప్రసాద్

నేలకొండపల్లి: అధికారం, పదవుల కోసం పాకులాడేది బూర్జవా పార్టీల లక్ష్యమని, నిరంతరం పేద ప్రజల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులేనని సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. గురువారం శత వసంతాల సందర్భంగా మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ నూతన దిమ్మెను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్లలో శక్తివంతమైన కమ్యూనిస్టులు, వారి త్యాగాలు చరిత్ర శిఖరాన నిలిచాయని, ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీల అవసరం పెరిగిందన్నారు. అనంతరం పార్టీ పతకాన్ని కాశిబోయిన అయోధ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కనకబండి సీతారాములు, కర్నాటి నళినిరాణి, మేకల పుల్ల య్య, రాయల మాధవరావు, పాలపాటి అశోక్, మల్లయ్య, నారాయణ, గణపతి, వెంకటేశ్వర్లు, వల్లాల కృష్ణ, విజయదుర్గ, గోపాలరావు, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన వరంగల్ క్రాస్‌రోడ్



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్ పరిసరాలు సీపీఐ శత వసంతాలను పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు ఎర్రతోరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఐ పైలాన్‌ను ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం శత వసంతాల సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకుడు వెంపటి చినకృష్ణమూర్తితో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి సురేందర్, చెరుకుపల్లి భాస్కర్, ఉపేందర్, మిడకంటి చినవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

- 28న న్యూడెమోక్రసీ విలీన సభ..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూసుమంచి: ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీనసభను జయప్రదం చేయాలని పార్టీ కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల సంయుక్త కార్యదర్శి ఐ.వెంకన్న కోరారు. గురువారం కూసుమంచిలో సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోని విప్లవకారులందరూ ఐక్యం కావాలనే ఉద్దేశంతో రెండు వర్గాల న్యూడెమోక్రసీ పార్టీలు ఏకం కాబోతున్నాయని, ఇది శుభపరిణామని అన్నారు.ఈ పార్టీల ఐక్యతతో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపె రవి, కొండా నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, గోపాల్, నాగేశ్వరరావు, నరేష్, గోపి, అనిల్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- 29న సీపీఎం పాలేరు డివిజన్ ప్లీనం..



మాట్లాడుతున్న బండి రమేష్

కూసుమంచి: ఈనెల 29న ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీపీఎం పాలేరు డివిజన్ ప్లీనంను విజయవంతం చేయాలని పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పాల్గొంటారన్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, ఎడవెల్లి రమణారెడ్డి, హన్మంతరావు, షేక్ బషీరుద్దీన్, గురుమూర్తి, గంగాధర్, వెంకటేశ్వరరావు, గన్యా నాయక్, కర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి వైద్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని వీడియోస్ కాలనీలో రోడ్డుపై చెట్ల కింద వానరం గాయపడి లేవలేని స్థితిలో ఉండగా.. స్థానికులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు తమ ఫౌండేషన్ అంబులెన్స్‌లో రాపర్తినగర్‌లోని పశు వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. అనంతరం వానరాన్ని ఫౌండేషన్‌కు తరలించి కోలుకునే వరకు పండ్లు, పాలు తాపిస్తున్నట్లు ఫౌండేషన్ బాధ్యుడు శ్రీనివాసరావు తెలిపారు.

జీఐఓ నూతన కమిటీ ఎన్నిక..

ఖమ్మం మామిళ్లగూడెం: పట్టణ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (జీఐఓ) పట్టణ కమిటీ ఎన్నిక గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షురాలిగా అస్కియా ఆసఫ్, కార్యదర్శిగా సీమ నాజనీన్, సందేశ కార్యదర్శిగా అమ్రీన్ ఉల్ హక్క, క్యాంపస్ ఆర్గనైజర్‌గా మెహజబా సిద్రా, మీడియా ఇన్‌చార్జ్‌గా హఫ్సాసాదియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఖమ్మం రీజినల్ ఆర్గనైజర్ ఖదిజతుల్ కుబ్రా, కొత్తగూడెం రీజినల్ ఆర్గనైజర్ హఫ్సా మెహ్వీన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఖదిజతుల్ కుబ్రా మాట్లాడుతూ.. ఏడాది పాటు కొనసాగనున్న ఈ నూతన కమిటీ బాధ్యులుబాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలను నిర్వహించాలని సూచించారు. సంస్థ సందేశాలను విద్యాలయాలలో చేరవేయాలని, విద్యార్థినుల్లో నైతిక విలువల స్థాపన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించేందుకు పాటుపడాలని హితవు పలికారు.

ఇదేం చోద్యం..!



అగ్నిమాపక కేంద్రం కోసం నిర్మించిన భవనం (ఇన్‌సెట్) భవనంలోని మార్కెట్ కార్యాలయం

వ్యవసాయ మార్కెట్‌లో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. ఈనేపథ్యాన భారీ నష్టాలు చవిచూడకుండా ఉండాలని 2015లో ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఆధునికీకరిస్తున్న క్రమంలో ఈ అగ్నిమాపక కేంద్రం వద్దకు కమిటీ కార్యాలయాన్ని మార్చడంతో ఇక్కడున్న అగ్నిమాపక శకటాన్ని తీసేశారు. దీంతో అనుకోని ప్రమాదాలు సంభవిస్తే ఇతర ప్రాంతం నుంచి శకటం రావాల్సిందే. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మాస్కులు ధరించి వినూత్న నిరసన



మాస్కులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. మంత్రుల మాస్కులు ధరించి 30వ తేదీ వరకు జరిగే క్యాబినెట్ మీటింగ్‌లో తమ ప్రధాన సమస్య అయిన పేస్కేల్‌ను ప్రకటించాలని కోరుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంతో ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంతేకాక ఓ చానెల్‌లో వీరిపై వస్తున్న అభియోగాలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు

కూసుమంచి: కేజీబీవీల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం సరికాదని, దీన్ని పీఆర్టీయూ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం కూసుమంచిలో జరిగిన సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రాంగ్ టీచర్ల పేరుతో అధికారులు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కేజీబీవీల్లో బోధనకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, దీంతో వారు పనిచేస్తున్న పాఠశాలల్లో విద్య కుంటుపడుతుందన్నారు. ఉపాధ్యాయులను బలవంతంగా కేజీబీవీలకు పంపడం సరికాదని, వారిని ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సతీష్, మండల బాధ్యులు వెంకన్న, రమణ, రవికిరణ్, సర్వర్‌మియా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

కామేపల్లి: గుంతలమయంగా మారిన లింగాల క్రాస్ రోడ్డు నుంచి మద్దిగూడెం వరకు గల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గురువారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యాన ఆందోళన చేశారు. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారైన ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని, వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్వీ రాకేష్, చల్లా రాజు, రాయల వెంకన్న, నాగేశ్వరరావు, యజ్ఞేష్, మహేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నేలకొండపల్లి: తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 30 రోజులుగా కాంటాలు వేయకుండా నిర్లక్ష్యం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కేంద్రాల్లో కొర్రీలు పెడుతుండగా.. మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, సొసైటీ మాజీ చైర్మన్ నంబూరి సత్యనారాయణ, మరికంటి రేణుబాబు, కుక్కల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

'వంగవీటి' సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: వంగవీటి మోహనరంగా సేవలు మరువలేనివని మున్నూరు కాపు సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ కొనియాడారు. గురువారం ఖమ్మంలో నిర్వహించిన వంగవీటి వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ నాయకులు కొత్తా సీతారాములు, నరాల నరేష్, యర్రా అప్పారావు, మదూరి సైదారావు, శ్రీ మాటేటి కిరణ్, మాటేటి రవి, జంగిలి రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రిన్సిపాల్‌ను సత్కరించిన పూర్వ విద్యార్థులు

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్డులో గల మారుతి విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం నిర్వహించారు. 1989–90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ అనుభవాలను పంచుకుని సందడిగా గడిపారు. అనంతరం నాటి ప్రిన్సిపాల్ లలితను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరుకు డివైడర్లతో ఇబ్బందులెన్నో..!



డిపో రోడ్డులోని డివైడర్

నగరంలో బస్ డిపో రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఇరకు రోడ్డులో డివైడర్లను ఏర్పాటు చేయడమేంటని అప్పట్లో ఆప్రాంతవాసులు ఆందోళన చేశారు. ఇరువైపుల షాపులు ఉండడంతో నిత్యం రద్దీగా మారడం, వాహనాలను షాపుల వద్ద పెట్టడంతో బస్ డిపో నుంచి వెళ్లే బస్సులు, స్కూల్ బస్సులకు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా మున్సిపాల్ అధికారులు స్పందించి డివైడర్లను తొలగించాలని ఆప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

- ఖమ్మం రాపర్తినగర్

మూడేళ్లుగా మారని పేర్లు..!



నేలకొండపల్లిలోని రైతువేదిక (ఇన్‌సెట్) సూచన బోర్డులో మారని అధికారుల పేర్లు

నేలకొండపల్లి: మూడేళ్ల క్రితం అధికారి మారినా, కొందరి బదిలీలు జరిగి స్థానాలు మారినా బోర్డుల్లో పేర్లు మాత్రం మారడంలేదు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ శాఖలకు చెందిన సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడంతో ఇక్కడికి వచ్చిన వారంతా నోటీస్ బోర్డు మీద పేర్లు చూసి నవ్వుకుంటున్నారు. గత మూడేళ్ల క్రితం మండల వ్యవసాయాధికారిగా పని చేసిన ఎస్.వీ.కే.నారాయణరావు బదిలీ అయి ముగ్గురు ఏఓలు మారినప్పటికీ ఇందుకు సంబంధించిన వివరాలను నోటీస్ బోర్డులో మార్చడం లేదు. అలాగే కూసుమంచి ఏడీఏగా పని చేసిన ఎస్.విజయచంద్ర ఇటీవల మధిర ఏడీఏగా బదిలీ అయ్యారని, రైతు వేదిక క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారి ఎం.దుర్గాభవాని పైనంపల్లికి బదిలీ చేసినా బోర్డులో పేర్లు మార్చకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం కూసుమంచి ఏడీఏగా బి.సరిత, నేలకొండపల్లి ఏఓగా రాధ, క్లస్టర్ ఏఈఓగా అరవింద్‌లు ఉన్నారు. కానీ నేలకొండపల్లి ఏఈఓగా ఎం.దుర్గాభవాని పేరు కొనసాగుతుంది. అధికారులు మారిన పేర్లు, వారి ఫోన్ నంబర్లు అంతే ఉండడంతో రైతులు ఏదైనా పని మీద వస్తే బోర్డులో పేర్ల ప్రకారం కలవాలా? అని ప్రశ్నిస్తున్నారు.